ప్రజాశక్తి

శుక్రవారం 20 జనవరి 2023 | 5 | విజయనగరం

22, 23 తేదీల్లో చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో చిరుధాన్యాల సాగును విస్తృతం చేసే లక్ష్యంతో ఈనెల 22, 23 తేదీల్లో నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి 2022-23 ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల్లో గల పోషక విలువలు, వాటి ప్రాధాన్యతను తెలియజేయడం ద్వారా వీటి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చిరుధాన్యాలపై అవగాహన కోసం ఈనెల 20న నగరంలో 2కె రన్ నిర్వహిస్తామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ రెండు రోజుల ప్రదర్శన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించి చిరుధాన్యాల ద్వారా ఆరోగ్యకర ఆహారం గురించి తెలుసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలులో విఫలం

- అధికార యంత్రాంగంలో లోపించిన చిత్తశుద్ధి
- నెరవేరని ప్రభుత్వ హామీ

కళ్లాల్లో ఉన్న ధాన్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ధాన్యం కొనుగోలు వ్యవహారంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడప దాటడం లేదు. సంక్రాంతి గడిచినా ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోకపోవడం ఇందుకు తార్కాణం. ఆరుగాలం శ్రమించి పోగుచేసిన ధాన్యాన్ని ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కొనుగోలులో పాలకుల చిత్తశుద్ధిలోపం, అధికారుల నిర్లక్ష్యం ఇందుకు కారణమని పలువురు వాఖ్యానిస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళిక రూపొందించినట్టు చెప్పినా ఆచరణలో దాన్ని అమలు చేయలేదు.

ఈ ఏడాది జిల్లాలో 4.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికార యంత్రాంగం తన నివేదికలో పేర్కొంది. ఇందులో 3లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఇప్పటి వరకు 2.50లక్షల మెట్రిక్ టన్నులకు మించి కొనుగోలు చేయలేదు. లక్షంలో కొనుగోలుకు 50వేల మెట్రిక్ టన్నులు మిగిలే ఉంది. ఈ ఏడాది మునుపటికన్నా దిగుబడి ఎక్కువ వచ్చిందని అధికారులే చెప్తున్న నేపథ్యంలో మరో లక్ష మెట్రిక్ టన్నుల వరకు రైతుల వద్ద ఉంటుందని రైతులు, రైతు సంఘాల అంచనా. గింజలన్నీ కల్లాల్లోనే ఉన్నాయి. కొనుగోలుకు నోచుకోకపోవడంతో పెట్టుబడులకు చేసిన అప్పులు రైతులు తీర్చుకోలేకపోతున్నారు. కానీ, కొద్ది రోజులుగా జిల్లాలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది. ధాన్యం కొనుగోలు ప్రభుత్వమే నిలిపివేసిందా? అంటే అధికారులు నీళ్ల నములుతున్నారు. ఈ ఏడాది పారదర్శకంగా, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేందుకు అధికారులైతే మిల్లర్లకు సంబంధం లేకుండా కొనుగోలు, ఇందుకోసం క్లస్టర్ విధానం అమలు చేస్తామని చెప్పారు. 3 నుంచి 4 ఆర్‌బికెల పరిధిలో ఒక క్లస్టర్ ఏర్పాటు చేస్తామని, 1000మెట్రిక్ టన్నులలోపు, 1000మెట్రిక్ టన్నులపైనా, 2వేల మెట్రిక్ టన్నుల దాటిన క్లసర్టర్లను ఎ, బి, సి గ్రేడులుగా విభజిస్తున్నామని చెప్పారు. ఆచరణలో అవీవే కనిపించ లేదు. గోనె సంచుల సమస్య ఎప్పటి మాదిరిగానే వేధిస్తోంది. జిల్లాలో సుమారు 132 మిల్లులు ఉన్నప్పటికీ 80మిల్లుల్లో మాత్రమే సార్టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వీటిలో కొంతమంది యజమానులు బ్యాంకు గ్యారెంటీలు చెల్లించకపోవడంతో లక్ష్యానికి అనుగుణంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఆయా మిల్లులకు వెళ్లిన ధాన్యం సంచులు ఖాళీ అయితే తప్ప మిగిలిన రైతులకు అందే పరిస్థితి లేకపోతోంది. దీంతో, ఎప్పటి మాదిరిగానే మిల్లర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 510ఆర్‌బికెల పరిధిలో 244క్లస్టర్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు చెప్పారు. అన్నిచోట్లా టెక్నికల్ అసిస్టెంట్లను నియమించారు. 'ఎ' కేటగిరి క్లస్టర్‌లో నలుగురు, బి,సి కేటగిరి క్లస్టర్లలో ముగ్గురు చొప్పున వాలంటీర్లను నియమించామని గత నవంబర్‌లోనే అధికారులు ప్రగల్భాలు పలికారు. ఆచరణలో అటువంటి పనిముట్లు, సిబ్బంది కనిపించలేదు. రవాణా ఛార్జీలతో పాటు హమాలీ ఛార్జీలను కూడా క్వింటాకు రూ.25 చొప్పున ప్రభుత్వం తరపున చెల్లిస్తుందని ప్రకటించిన విషయం విధితమే. ఆచరణలో అటువంటి సాయమేదీ తమకు అందడం లేదని రైతులు చెబుతున్నారు. ఎవరి గోల వారి దన్నట్టు ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో అంటూ రైతులు గగ్గోలు పెడుతుండగా అధికార యంత్రాంగం మాత్రం తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

కానిస్టేబుళ్ల రాత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

- 43 పరీక్షా కేంద్రాల్లో ప్రాథమిక పరీక్ష
- 144 సెక్షన్ అమలు • సిసి కెమెరాలతో పర్యవేక్షణ : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ఈనెల 22న నిర్వహిస్తున్న ప్రాథమిక రాత పరీక్షకు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. జిల్లాలో 43 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విజయనగరంలో 28, బొబ్బిలిలో 13, రాజాంలో 2 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే సంబంధిత పోలీసు అధికారులు పరీక్షా కేంద్రాలను

సందర్శించి, స్ట్రాంగ్ రూంలు, భద్రత, సిసి కెమెరాల పనితీరును పర్యవేక్షించారన్నారు. అభ్యర్థులను పరీక్షించిన తరువాతనే ఉదయం 9గంటల నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 10గంటల తరువాత ఎవ్వరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని తెలిపారు. హాల్ టిక్కెట్లలో సూచించిన నిబంధనలు అభ్యర్థులు పాటించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, బ్లూ టూత్, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అనుమతించబోరని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం వారికి దిశా నిర్దేశం చేసేందుకు రైల్వే స్టేషను, బస్ స్టేషనులో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. జెఎన్‌టియు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా రెండు వాహనాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ వాహనాలు అభ్యర్థులను జెఎన్‌టియు జంక్షన్ నుండి పరీక్షా కేంద్రం వరకు తీసుకొని వెళ్ళేందుకు, తిరిగి జెఎన్‌టియు జంక్షనుకు చేర్చేందుకు వినియోగిస్తామని తెలిపారు.

బకాయిలు చెల్లించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

ధాన్యం బకాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు, రైతులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, గంటా కృష్ణ, మతల బలరాం రామకృష్ణ, బొంగు కృష్ణ మాట్లాడుతూ గతేడాది రూ.5లక్షల 60వేల బకాయిలు చెల్లించాలని, ఈ సొమ్ము విషయమై ఆర్‌బికె, జిల్లా వ్యవసాయ అధికారులను కోరినా నేటికీ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు రావాల్సిన డబ్బులు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకపోతే ఆర్‌బికెలు, వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఊరకనే జీతాలు ఇవ్వడం లేదు

గురుకుల సిబ్బందిపై ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం ఊరకనే జీతాలు ఇవ్వడం లేదని, విద్యార్థులకు బాగా చదువు చెప్పకపోతే రిమూవ్ చేస్తామని గురుకుల పాఠశాల సెక్రటరీ నర్సింహ రావు, ప్రిన్సిపాల్ రఘునాథరావుపై విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి గురుకుల పాఠశాలను గురువారం రాత్రి ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ చేశారు. ఐదో తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్స్‌ను పరిశీలించగా గణితం సెమిస్టర్ - 1 సక్రమంగా చెప్పక పోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కోట్లు రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం వర్క్ బుక్స్ ఇస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించకపోవడం సరికాదన్నారు. బాధ్యతగా పని చేయకపోతే క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా పని చేయని సిబ్బందిపై చర్యలు తీసుకునే ధైర్యం లేదా అని గురుకుల పాఠశాల సెక్రటరీ నరసింహరావును ప్రశ్నించారు. మైనర్ చర్యలు తీసుకునే హక్కు తనకు ఉందని, మేజర్ చర్యలు తీసుకునే హక్కు ప్రిన్సిపాల్ సెక్రటరీకు మాత్రమే ఉందని నరసింహరావు సమాధానం చెప్పారు. గురుకుల పాఠశాలలను ఎన్నిసార్లు తనిఖీ చేస్తున్నారని ప్రవీణ్ ప్రకాష్ ప్రశ్నించగా నెలకు ఒకసారి తనిఖీ చేస్తున్నామని గురుకుల పాఠశాల సెక్రటరీ చెప్పారు. తనిఖీ చేస్తే ఇలా ఎందుకు ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా పని చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక్కరోజు సమయం ఇస్తే చర్యలు తీసుకుంటామని నరసింహ రావు అన్నారు. విద్యార్థులను తరగతి గది నుంచి బయటకు పంపివేసి గురుకుల పాఠశాల సెక్రటరీ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కెజిబివి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థినులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని మరింత రాణించాలని సూచించారు.

నేటి నుంచి 24 వరకు ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 19 నుండి 24వ తేదీ వరకు వివిధ చోట్ల ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు వెల్లడించారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో 6 పాఠశాలల్లో మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారు నమోదు ప్రక్రియ కేంద్రాలకు రావాలని కోరారు. 19,21వ తేదీలలో బిపిఎం హైస్కూల్, గురజాడ పబ్లిక్ స్కూల్, కంటోన్మెంట్ హైస్కూల్, 23, 24 తేదీలలో కస్పా హైస్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్- విటి అగ్రహారం, జిల్లా పరిషత్ హైస్కూల్ గాజులరేగలో ఆధార్ నమోదు మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సెట్విజ్ సిఇఒగా రామ్‌గోపాల్

ప్రజాశక్తి -విజయనగరం కోట

యువజన సర్వీసులశాఖ నూతన సిఇఒగా బి.రాంగోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించిన ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు సెట్విజ్ మేనేజర్ కెవిఎస్ఎన్ మూర్తి, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాంగోపాల్ తెలిపారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ముద్రించినా, వినియోగించినా కఠిన చర్యలు
- కలెక్టర్ సూర్యకుమారి హెచ్చరిక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఈనెల 26 నుంచి జిల్లాలో ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. పర్యావరణ హానికర ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం గురించి అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం తన ఛాంబర్లో జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.75, 522లలో పేర్కొన్న నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి జనవరి 26 నుంచి జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో పర్యావరణ హితమైన క్లాత్ బ్యానర్లను వినియోగించుకోవాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసినా, విక్రయించినా జరిమానాలు విధించాలని చెప్పారు. మొదటి తప్పుగా రూ.50 వేలు, రెండోసారి తప్పు చేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు సంబంధిత పరిశ్రమ లేదా షాప్‌ను సీజ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ బ్యానర్లను ప్రదర్శించరాదని, తయారు చేయరాదని, ఇతర ప్రాంతాలకు తరలించరాదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ విభాగం ఈఈ సుదర్శన్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పాపారావు, మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్డీవో ఆదినారాయణ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులు, ప్లాస్టిక్ తయారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక నాలుగో డివిజన్ మంగళ వీధి కాలనీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవినీతి రహితంగా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్న పాలనను దీవించి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోలగట్ల కోరారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ శనివారం నుండి 14వ డివిజన్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ డివిజన్లో ఇప్పటివరకు సుమారు నాలుగు కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆధ్వర్యంలో జరిగాయన్నారు. వీధి దీపాలు కాలువలు రహదారులు కొన్నిచోట్ల లేకపోవడాన్ని స్థానికులు ప్రస్తావించగా తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపార న్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, కార్పొరేటర్ బండారు ఆనందరావు, వజ్రపు శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

జాతర ఏర్పాట్లు ఎస్‌పి పరిశీలన

మక్కువ : ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు సిబ్బందితో చర్చించారు. గురువారం శంబర గ్రామాన్ని సందర్శించి జాతరకు సంబంధించిన పలు భద్రతా అంశాలపై పోలీస్ శాఖ సిబ్బందితో ఆయన చర్చించారు. అనంతరం పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, పోలీస్ శాఖ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

ప్రభుత్వ రంగాన్ని కాపాడండి

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన ప్రదర్శన

నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ రంగాన్ని కాపాడండి.. ఎల్ఐసిని బలోపేతం చేయండి అంటూ జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా ఎల్ఐసి ఉద్యోగులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిఇయు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస మాట్లాడారు. ఎల్ ఐ సి దశాబ్దాలుగా, స్థిరంగా తన లక్ష్యాలను నెరవేరుస్తోందన్నారు. ప్రభుత్వ సామాజిక బాధ్యతలను నెరవేర్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని అన్నారు. 1956లో రూ.5 కోట్ల ప్రారంభ మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసి నేడు రూ.42, 30, 617 కోట్లు ఆస్తులు, రూ. 37, 35, 760 కోట్లు లైఫ్ ఫండ్ కలిగిఉందని వివరించారు. జీవిత బీమా వ్యాపారంలో రెండు దశాబ్దాల పోటీ తర్వాత కూడా దేశంలో జీవిత బీమా వ్యాపారంలో ఎల్ ఐ సి అత్యధిక మార్కెట్ వాటాను కలిగి ఉందన్నారు. ఐఆర్‌డిఎ అనుసరిస్తున్న విధానాల వలన నేడు దేశంలో బీమా పరిశ్రమ చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌డిఎ నిర్ణయాలతో మన దేశంలో బీమా పరిశ్రమ 1956కు పూర్వపు పరిస్థితులకు వెళ్లే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. పాలసీదారుల సొమ్ముకు భద్రత కరువవుతుందన్నారు. కేవలం ఎల్ఐసి లోనే కాకుండా, బాగా లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ, ప్రైవేటీకరణ చాలా వేగంగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఈ విధానాలను బీమా ఉద్యోగులతో పాటు ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు.

ఎల్ఐసిని బలోపేతం చేయాలి

గరివిడి : ఎల్ఐసిని బలోపేతం చేసుకోవాల్సిందేనని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస అన్నారు. జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసి ఆఫీస్ వద్ద భోజన విరామ సమయంలో బ్రాంచ్ యూనిట్ అధ్యక్షులు డిఎస్ ప్రసాద్, బ్రాంచ్ యూనిట్ కార్యదర్శి జీ. సిద్ధార్థ, కేవిఎన్ మూర్తి, ఆధ్వర్యంలో ఉద్యోగుల ప్రదర్శన నిర్వహించారు. ఎల్ఐసిలో ఐపిఒను బీమా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

తేనెటీగల పెంపకంపై యువతకు అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

తేనె టీగల పంపకానికి విజయనగరం జిల్లా అనుకూలమైందని ఖాదీ, గ్రామీణ పరిశ్రమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్ గ్రీవ్ అన్నారు. మండలంలోని నిమ్మలపాలెం పంచాయతీ శివారు రాయపురాజుపేట గ్రామ సమీపంలో కన్నా నర్సరీ వద్ద పూసపాటిరేగ, కొత్తవలస మండలాలకు చెందిన తేనెటీగల పెంపకం దారులకు నూరు శాతం రాయితీలపై 200 పెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ ఎస్.గ్రీవ్ మాట్లాడుతూ జిల్లాలో తేనెటీగల పెంపకానికి అనువైన వాతావరణం ఉందన్నారు. నిరుద్యోగ యువకులు ముందుకు వస్తే వారికి వారం రోజులు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం వారికి రాయితీపై ఒక్కొక్కరికి యాభై వేల రూపాయలు విలువచేసే పది తేనెటీగల పెట్లను అందజేస్తామన్నారు. యువత సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. ముందుగా తేనెటీగల పెంపకం పై శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు కార్యక్రమంలో ఖాదీ కమిషన్ ఎడి ఈశ్వరరావు, అకౌంటెంట్ ప్రభాకర్, వైసిపి నాయకులు కొట్యాడ శ్రీనివాసరావు. కన్నా నర్సరీ అధినేత దుక్క కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పై ఓవర్ లోడింగ్ నిరోధించాలి

కలెక్టర్ సూర్యకుమారి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, రవాణాశాఖ ఉప కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొని ప్రమాదాల నివారణకు సలహాలను, సూచనలను అందించాలని కలెక్టర్ సూర్య కుమారి ఆదేశించారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి శాఖల మధ్య సమన్వయం చాల అవసరమని అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆర్‌టిసి బస్సులను రహదారిపై ఎక్కడబడితే అక్కడ ఆప కుండా నిర్దేశించిన స్టాప్ లలోనే ఆపేలా చూడాలని ఆదేశించారు. రైతు బజార్ల ముందు రహదార్లపై దుకాణాలు అధిక సంఖ్య లో వెలుస్తున్నాయని, వాటిని నిరోధించాలని తెలిపారు. రహదారి భద్రతపై పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యాశాఖ ద్వారా అవగాహనా తరగతులను నిర్వహించాలన్నారు. వారోత్స వాల్లో రహదారి గుర్తులు, భద్రత పై విద్యార్థులకు క్విజ్ , వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించాలన్నారు. భోగాపురం హైవే పై పశువుల సంచారం , పాద చారుల క్రాసింగ్ వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని నిరోధించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి అవగాహనా కలిగించాలని కలెక్టర్ సూచించారు. వాహనాలపై ఓవర్ లోడ్ వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని పోలీస్ అధికారులకు సూచించారు. హెల్మెట్ వాడకాన్ని కూడా ప్రోత్సహించాలని, పోలీస్, రవాణా శాఖలే కాకుండా రెవిన్యూ ఇతర శాఖలు కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఎస్.పి దీపిక పాటిల్ మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన, మరణించిన వారి ఫోటోలను, వాహనాలను రహదారి కూడళ్లలో ప్రదర్శించాలని, వాటిని చూసే వారికీ భయం, బాధ్యత కలుగుతాయని అన్నారు. సమావేశంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్, డిఎంహెచ్ఒ డాక్టర్ రమణకుమారి, డిసిహెచ్ఎస్ గౌరీశంకర్, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్. మోహనరావు, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఆర్‌టిసి , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదాం పనులు పరిశీలన

వంగర : స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వెనుక భాగాన నిర్మితమవుతున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ గోదామును ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ గురువారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం గోవిందరావు, అధ్యక్షులు రామ్మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతతోనే ప్రమాదాలు నివారణ

బొబ్బిలి : రోడ్డు భద్రతతోనే ప్రమాదాలను నివారించడం సాధ్యమని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని కోరారు. కారులో ప్రయాణిస్తే సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.పాలినాయుడు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

బొబ్బిలి : స్థానిక పాత బొబ్బిలి శ్రీరాములు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1996-97 పదోతరగతి పూర్వ విద్యార్థులు గునుపూరు రమేష్, జి.చక్రధర్, ఏ.ఎస్.కృష్ణ, డి.ఐటిఐ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులంతా గురువారం కలిశారు. అలనాటి జ్ఞాపకాలు తలచుకుని సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి, తమతో చదువుకున్న ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పూర్వ విద్యార్థులను ఆదుకోవాలని తీర్మానించారు. అప్పటి హెచ్ఎం దొకు రాములు, ఉపాధ్యాయులు డి.లక్ష్మి, జి.కళ్యాణి, కృష్ణ కుమారి, సిహెచ్ వరప్రసాద్, బండి రమేష్‌లను ఘనంగా సత్కరించారు.

ఖాళీలన్నింటినీ బదిలీకి అనుమతించాలి

భోగాపురం : ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ బదిలీలకు అనుమతించాలని గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించాలని హ్యూమన్ రైట్స్ జిల్లా కన్వీనర్ బి. జోగినాయుడు అన్నారు. ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2005 నుంచి ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినప్పుడు కేటగిరి 1,2,3 పాఠశాలకు సంబంధించి ఖాళీలను కోరగా ఎక్కువ ఖాళీలను బ్లాక్ చేయడంతో ఉపాధ్యాయుల స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. ఏటా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

బైరెడ్డి యర్రప్పలనారాయణను అభినందిస్తున్న నాయకులు

మండల కన్వీనర్‌కు అభినందనలు

భోగాపురం : సచివాలయాల మండల కన్వీనర్, గృహ సారథుల మండల కోఆర్డినేటర్‌గా ఎంపికైన బైరెడ్డి యర్రప్పలనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా గూడెపువలస సచివాలయ కన్వీనర్, దల్లిపేట మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు, దల్లిపేట గ్రామ వాలంటీర్లు, కార్యకర్తలు ఆయనను మర్యాద పూర్వకంగా గురువారం కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి పాపి సర్పంచ్ బైరెడ్డి రాజు, సోషల్ మీడియా కన్వీనర్ బాక కనకారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'చీపురుపల్లి'

వంగర: మండలంలోని కింజంగిలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 9న నుంచి ఉత్సాహంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిసాయి. ఈ పోటీల్లో మొత్తం 54 జట్లు పాల్గొనగా మొదటి బహుమతి చీపురుపల్లి జట్టు కైవసం చేసుకుంది. రెండవ బహుమతి తెర్లాం మండలం కుసుమూరు, 3వ బహుమతి రాజాం, 4వ బహుమతి కింజంగి జట్టు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్లకు గ్రామ సర్పంచ్ బొంతు వెంకటరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

గరివిడి : మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో చీపురుపల్లి మండలం, ఇటకర్లపల్లి, నిమ్మలవలస సచివాలయ పరిధిలో ఖాళీ అయిన రెండు వాలంటీర్ పోస్టులకు ఎంపికైన దన్నాన సత్యనారాయణ (ఇటకర్లపల్లి), సతివాడ సత్యనారాయణ (నిమ్మలవలస)కు నియామక పత్రాలను వైసిపి నాయకులు గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జెడ్‌పి వైస్ చైర్మన్ జగన్, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, మండల పార్టీ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎంపిడిఒ కె. రామకృష్ణంరాజు, కర్లాం సోసైటీ అధ్యక్షులు చందక గురునాయుడు, రేవళ్ల సత్తిబాబు, శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కారాడలో పొలంబడి

బొబ్బిలి : మండలంలోని కారాడలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రస్తుతం ఆపరాల పంటపై ఉన్న తెగుళ్లు, పురుగుల మీద రైతులకు అవగాహన కల్పించారు. పూత, పిందె దశలో కాయ తొలుచు పురుగు, పల్లాకు తెగులు గుర్తించవచ్చునన్నారు. వీటి నివారణకు డైమిథోయేట్, మోనోక్రోటోఫాస్, కార్బెన్డజిం అనే పొడి మందును 250 గ్రాములు చొప్పున తప్పనిసరిగా వేప నూనెను ఎకరానికి అర లీటర్ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అనంతరం తెల్ల దోమ, శనగపచ్చ పురుగును పొలంలో గుర్తించి లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు మూడెడ్ల సంతోష్, మాధురి, రమ్య పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్ పరిశీలన

రేగిడి : మండలంలోని దేవుదల గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ రావు పరిశీలించారు. నూతనంగా ఆధార్ నమోదు ప్రక్రియతో పాటుగా ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ కార్డుతో పాటు పుట్టిన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. బయోమెట్రిక్, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకును ప్రభుత్వ నిబంధన మేరకే నగదు రహిత అందజేయాలని తెలిపారు. ఆధార్ కార్డు వచ్చిన వారి నుంచి అధిక వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రజలకు అన్ని రకాల సర్వీసులు అందజేయాలన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి, సంకిలి డిజిటల్ అసిస్టెంట్ హరిబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాఠశాలల్లో నూతన మెనూ

శృంగవరపుకోట : సంక్రాంతి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలో గురువారం నూతన మెనూను అమలు చేయడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. సాధారణ రోజులలో జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతి గురువారం పాఠశాలలో సాంబారు బాత్, ఉడికించిన కోడిగుడ్డు మెనూ ప్రకారం వడ్డించేవారు. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రభుత్వం నూతన మెనూ సూచించింది. దీని ప్రకారం సాంబార్ బాత్ ఉడికించిన కోడిగుడ్డు కానీ నిమ్మకాయ పులిహోర, ఉడికించిన కోడిగుడ్డు, టమాట పచ్చడి వడ్డించమని ప్రభుత్వం ఆదేశించింది. నూతన మెనూ ప్రకారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న 203 మంది విద్యార్థులకు గురువారం 'నిమ్మకాయ పులిహోర', 'టమాట పచ్చడి', 'ఉడికించిన కోడిగుడ్డు' తదితర ఆహార పదార్థాల వడ్డించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రత పాటించాలి

గజపతినగరం : అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ (ఎస్‌బిసిసి) జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొమరా కాలనీ లో ఉన్న బాలికలు, గర్భిణులలో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ప్రతి బాలికకు కనీసం 12 శాతం హిమోగ్లోబిన్ కలిగి ఉండేలా వారిలో అవగాహనా కల్పించాలన్నారు. ప్రతిరోజు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చున్నారు. హిమోగ్లోబిన్ 7శాతం కంటే తక్కువ ఉంటే తీవ్ర రక్తహీనతగా గుర్తించి డాక్టర్ల సలహా మేరకు మందులు తీసుకోవాలన్నారు.

వేమన పద్యాలు ఆధునిక పరిశోధనలకు ఆధారం

ప్రజాశక్తి-విజయనగరం

సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు ఎన్నో ఆధునిక పరిశోధనలకు ఆధారం కావడం గర్వకారణమని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఆటవెలది చందంలోనే పద్యాలను రచించి లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో.. చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా వేమన తన భావాన్ని ప్రజలకు చెప్పారని కీర్తించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో యోగి వేమన జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, డిఆర్ఒ ఎం. గణపతిరావు, పలుశాఖల అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేమన విగ్రహారాధనకు, కులాలకు, మతాలకు అతీతమని ఆయన పద్యాలను చెందిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని కీర్తించారు. ఆయన రచించిన ఎన్నో పద్యాలు నేటి ఆధునిక యుగంలో చేపడుతున్న పరిశోధనలకు ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన రాసిన సమాజ పరిస్థితులకు అద్దం పట్టేలా వేమన పద్య రచనలు సాగాయని, ఇలాంటి కవి ఉండటం తెలుగు ప్రజలకు గౌరవప్రదమని కొనియాడారు. నేటి తరం పిల్లలకు వేమన పద్యాలను తప్పకుండా నేర్పించాలని డిఇఒకు సూచించారు. వేమన జయంతిని పురస్కరించుకొని విద్యాశాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య పఠన పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో వేమన చిత్రపటానికి ఎస్‌పి ఎం.దీపిక పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామరులకు అర్థమయ్యే భాషలో పద్యాలను వినిపించి,

అందరిని మెప్పించిన మహాకవి వేమన అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, పలువురు సిఐలు పాల్గొన్నారు.

విజయనగరం కోట : యోగివేమన శతక పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన రత్న హారాలు అని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు కొనియాడారు. వేమన జయంతిని విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా యోగివేమన చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం మూడు నాలుగు ఐదు ఆరు ఏడు తరగతి విద్యార్థులకు యోగివేమన శతక పద్యాలపై పఠన పోటీలు నిర్వహించారు.

యోగి వేమనకు జెడ్‌పి చైర్మన్ నివాళి

జిల్లా పరిషత్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజకుమార్, డిపిఒ నిర్మలా దేవి, వైసిపి నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వేమన శతకాలు భవిష్యత్ తరాలకు దిక్సూచి

విజయనగరం టౌన్ : వేమన శతకాలు, ఆయన రచనలు భవిష్యత్తు తరాలకు దిక్సూచి లాంటివని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ విభాగాల అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి : తన పద్యాల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించి ప్రజా కవిగా పేరుగాంచిన యోగి వేమన తెలుగు ప్రజలకు చిరస్మరణీయుడని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. గురువారం ఆ పాఠశాలలో వేమన జయంతిని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి జెసి రాజు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, శ్రీనివాసరావు, మురళి, రామ చంద్రరావు, మహేష్‌లు పాల్గొన్నారు.

బొబ్బిలి: వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

1800 మందికి ఒక్కటే బోరు..

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పనిచేయని రక్షిత మంచినీటి పథకం
- పట్టించుకోని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- వంగర

కంప్యూటర్ యుగంలో కూడా ఇంకా కొన్ని గ్రామాల్లో తాగునీటికి ఎదురు చూపులు తప్పడం లేదు. చాలా ప్రాంతాల్లో కార్మిక హక్కులు, ఉద్యోగాలు కోసం పోరాటం చేస్తుంటే ఆ గ్రామంలో మాత్రం తాగునీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఎన్నికల సమయంలో తప్ప నాయకులు ఆ గ్రామం వైపు చూడకపోవడంతో ఆ గ్రామం గొంతెండి పోతోంది. గ్రామస్తులందరికీ ఒక్క బోరే ప్రస్తుతం దాహార్తిని తీరుస్తుంది. దీంతో అక్కడ తాగునీటి కోసం బారులు కనిపిస్తాయి. రాబోతున్న వేసవిలో ఆ బోరు కూడా మరమ్మతుకు గురైతే ఆ గ్రామస్తులు దాహార్తిని ఎవరు తీరుస్తారని ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని కొప్పర గ్రామంలో అన్ని కులాలు కలిపి సుమారు 1800 మంది నివాసముంటున్నారు. వీరందరూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వీరందరూ గ్రామ శివారులో ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న తాగునీటి బోరునే ఉపయోగిస్తున్నారు. ఇంటి నుంచి చాలా దూరం వెళ్లడంతో పాటు బోరు వద్ద చాలా సమయం వెచ్చించవలసి వస్తుందని, తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మరో రెండు చోట్ల బోర్లు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదు. దీంతో ఊరంతా ఒకే బోరుపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

దిష్టిబొమ్మల దర్శనమిస్తున్న రక్షిత మంచినీటి పథకం

తాగు నీటిని అందించేందుకు గ్రామంలో గతంలో రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. చాలా కాలంగా అది నిరుపయోగంగానే ఉంది. దీంతో ఏళ్ల తరబడి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

గ్రామమంతటికీ ఈ ఒక్క బోరే ఆధారం

ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

గ్రామంతో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. పోని ఇంటి వద్ద మోటారు వేయించుకుందామన్న మా దగ్గర సొమ్ము లేదు. కూలి పనిచేస్తే తప్ప కుటుంబం నడవని పరిస్థితి మాది. తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవటం లేదు.

కుప్పిలి కర్రమ్మ, రెల్లి వీధి, కొప్పర

ఇబ్బందులు పడుతున్నాం

గ్రామంలో తాగునీరు లేక ఊరు చివరలో ఉన్న ఒకే ఒక్క బోరు వద్దకు తాగునీటి కోసం మహిళలంతా ఒకేసారి రావడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. గంటల కొద్ది నీటి కోసం నిరీక్షించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాన్ని బాగు చేయాలి.

చప్ప ఈశ్వరమ్మ, గొల్ల వీధి, కొప్పర

తాగునీరు అందించాలి

ఊరు శివారులో పాఠశాల సమీపంలో ఉన్న ఒకే ఒక్క బోరు ప్రస్తుతం పని చేస్తుంది. నిత్యం వాడటం వల్ల అది కూడా ఎప్పుడు మరమ్మతులకు గురవుతుందో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

కోరాడ రాముడమ్మ, నాయుడు వీధి, కొప్పర

తాగునీరు అందే విధంగా ఏర్పాటు చేస్తాం

జలజీవన్ మిసనలో భాగంగా కొప్పర గ్రామానికి ఇంటింటా కుళాయిలు మంజూరయ్యాయి. ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లకు పంపించాం. ప్రస్తుతం కొప్పరలో ఉన్న మోటారు బాగు చేయించి తాగునీరు అందే విధంగా ఏర్పాటు చేస్తాం.

సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వంగం

పేరాపురంలో గడప గడపకు..

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ రౌతు శ్రీరామూర్తి అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశమయ్యారు. గ్రామంలో ఉన్న పరిస్థితితులుపై ఆరా తీసారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వాలంటీర్లు చెప్పారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణ రాజు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, మొంగం నాగబాబు, టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, కోరాడ మహేష్, శాంతాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల : ఉమ్మడి జిల్లా రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర సంఘ సలహాదారు సముద్రపు రామారావు కోరారు. గురువారం జర జాపు పేటలో రెండు జిల్లాలకు సంబంధించిన కార్యవర్గ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ వేతనంను యం.డి.యు.ఆపరేటర్లకు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకూ ఇవ్వాలని, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు జిల్లాల్లో గల రేషన్ డీలర్లకు రావలసిన ఎం.డి.ఎం రైస్ కమిషన్, అంగన్వాడి సెంటర్లకు సరఫరా చేస్తున్న నిత్యవసర వస్తువులకు ఇచ్చే కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఏర్పాటు చేసుకున్న దుకాణదారుల సంక్షేమ సంఘం ట్రస్ట్‌కు ఈ నగదును బదలాయింపు చేయాలని కోరారు. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకు మరణించిన 125 మంది రేషన్ డీలర్లకు వారి కుటుంబ సభ్యులకు ఈ ట్రస్ట్ ద్వారా ప్రతి ఒక్కరికి రూ.10వేలు చొప్పున ఫిబ్రవరి నెల మూడో వారంలో ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా యూనియన్ల అధ్యక్షులు ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాన నారాయణరావు, గేదెల సత్యనారాయణ, సుంకరి సూర్యారావు, పాలూరి అప్పారావు, అట్టాడ అప్పారావు, కుసుమంచి జగయ్యాశెట్టి, గోపాల్, జనార్ధన్, గజపతినగరం శ్రీను, కెళ్ళ భీమారావు, వేపాడ కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం ఎంతైనా అవసరమని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని దత్తి గ్రామంలో గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా, దత్తి గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు, క్రీడాకారులకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ వాలీబాల్ పోటీల నిర్వాహకులకు క్రీడాకారుల బహుమతులకు గానూ రూ. పదివేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ళ వెంకటరమణ (శ్రీను), విశాఖ టిడిపి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు తిక్కాన చిన దేముడు, కొత్తవలస మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు లాలం అర్జునరావు, గొంప దుర్గా ప్రసాద్, పొట్నూరు వెంకట రత్నాజి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

చీపురువలసలో టిడిపి రాష్ట్ర అయ్యారక సాధికార సమితి అధ్యక్షులు బంగారు రమేష్ ఆధ్వర్యంలో అతని తండ్రి కీర్తిశేషులు బంగారు కొండ మాస్టారు 13వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి చేతులు మీదుగా 200 మంది పేదవారికి గురువారం చీరలు పంపిణీ చేశారు. ముందుగా బంగారు కొండ మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి కోళ్ళ వెంకటరమణ (శ్రీను), విశాఖ టిడిపి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు తిక్కాన చిన దేముడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కనకాల శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

కోర్టు ఆదేశాల మేరకు విచారణ

రేగిడి : మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధి అక్కన్న అగ్రహారం గ్రామంలో ఇళ్ల స్థలం ఫీజిబిలిటీ కోసం అడపాక నారాయణమ్మ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోగా, వాటిని తిరస్కరించడంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. జడ్జి ఆదేశాల మేరకు గురువారం ఆ గ్రామానికి తహశీల్దార్ టీ. కల్యాణ చక్రవర్తి తన సిబ్బందితో కలిసి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామ కంఠంలో అడప నారాయణమ్మ ఫీజిబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు తిరస్కరించడంతో ఆమె కోర్టుకెళ్లారు. గతంలో పని చేసిన తహశీల్దార్ అదే గ్రామానికి చెందిన గ్రామ కంఠంలో అదే స్థలంలో పప్పుల రాములమ్మకు ఫీజిబులిటీ మంజూరు చేశారు. ఒకరికి పీజిబులిటీ ఇచ్చి, ఇంకొకరికి ఫీజిబులిటీ మంజూరు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తమైంది. ఒకే స్థలంలో ఇద్దరికీ ఫీజుబులిటీలు ఇవ్వడం జరగదని తహశీల్దార్ విచారణ తరువాత తెలిపారు. ఇరు కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ మీటర్లు ఉన్నాయని, పూర్తిస్థాయిలో శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించారు. తహశీల్దార్‌తో పాటు ఆర్ఐ ఉమా పట్నాయక్, విఆర్ఒ హరితారాణి ఉన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్ చక్రవర్తి

ఘనంగా ముత్యాలమ్మ తీర్ధ మహోత్సవం

వేపాడ : మండలంలోని గ్రామంలో ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు కుండలు, గాలిపటాలు ఎగరవేత పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముందు అమ్మవారి ఊరేగింపుగా బ్యాండ్ మేళం, డప్పు వాయిద్యాలతో ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాసాపేట రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కాసాపేట రేషన్ డీలర్ ఐ. పార్వతి పై విజిలెన్స్ సిఐ సింహాచలం గురువారం 6ఎ కేసు నమోదు చేశారు. లబ్ధిదారులు తీసుకున్న రేషన్ కన్నా అధికంగా స్టాక్ ఉండడాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఉండవలసిన దానికన్నా బియ్యం 23.47 క్వింటాలు, కందిపప్పు 1.31 క్వింటాలతో పాటు పంచదార 122 కేజీలు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ సింహాచలం మాట్లాడుతూ ఈ తరహా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఇవ్వకుండా వారి నుండి వేలిముద్రలు సేకరించి డబ్బులిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అట్టి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అటువంటి డీలర్లపై తమకు ఫిర్యాదు చేసినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

కొత్తవలస : మండలంలోని వీరభద్రపురంలో పిడిఎస్ రైస్ అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిటి రమేష్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేయగా సుమారు 67.22 క్వింటాలు పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వను గుర్తించామన్నారు. మధ్య వర్తుల సమక్షంలో విచారణ జరిపి, సదరు అక్రమ పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిల్వ ఉంచిన సత్యవరపు వెంకట బంగార్రాజుపై 6ఏ పిడిఎస్ కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సరుకును ఎంఎల్ఎస్ పాయింటు నందు భద్రపరిచి తదుపరి ఉత్తర్వులు కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

CHANGE OF NAME

Santoshi Kumari Thappiti, W/o Sankara Rao Thappiti, Service No 15327745H Rank L/HAV Residing 15-292, Munsub Veedhi Srungavarapukota (Village), Vizianagaram (Dist), A.P. Pin-535145. My Surname wrongly Mentioned in My Husband Service Records As Mopada Santhoshi Kumari, I Request Concern Authorities Please Change my Name **Santoshi Kumari Thappiti** as per My Aadhar Card Records.

CHANGE OF NAME

Tappiti Gangayyamma my son Tappiti Sankara Rao, Service No-15327745H Rank L/HAV, Residing Srungavarapukota (Village), Vizianagaram (Dist), A.P. Pin-535145. My Son Army Records Wrongly Mentioned in Tappiti Ganga Laxmi & Date of Birth 12/03/1952, Please Change My Name & Date of Birth **Thappiti Gangayyamma & DOB - 01/01/1961** as per My Aadhar Card.